# ప్రపంచాన్ని ఓ కుటుంబంలా భావించాలి

- రాష్ట్రపతి ద్రౌపదిముర్ము
- కన్హాశాంతి వనంలో గ్లోబల్ ఆధ్యాత్మిక మహోత్సవం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జ్ఞాపికను అందజేస్తున్న రామచంద్ర మిషన్ అధ్యక్షుడు డాక్టర్ దాజీ

షాద్‌నగర్, మార్చి 15 : ఈ ప్రపంచాన్ని మనమందరం ఓ కుటుంబంలా భావించాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. నందిగామ మండలంలోని కన్హాశాంతి వనంలో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ ఆధ్యాత్మిక మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్లోబల్ ఆధ్యాత్మిక మహోత్సవ సందేశం ప్రపంచ శాంతికి, మానవ సంక్షేమానికి సూచిక అని చెప్పారు. మానవజాతి సహజతత్వంతో కూడిన జీవన విధానానికి అలవాటుపడాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల వారి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. సంప్రదాయాలు సత్యానికి మార్గాలనే విషయాన్ని గ్రహించాలన్నారు. నేటి సమాజంలో నైతిక బాధ్యతతో జీవించడంతోపాటు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. మన సంస్కృతిని గౌరవిస్తూనే ఆధునికతతో అభివృద్ధి వైపు పయనించాలని సూచించారు. మహావీరుడు, భగవాన్‌బుద్ధ, జగదుర్గ శంకరాచార్యులు, సంత్ కబీర్, గురునానక్, స్వామి వివేకానంద వంటి మహానుభావులు ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటారని, ప్రజలను చైతన్యం చేశారని గుర్తు చేశారు. వర్తమానంలో చేసే మంచి పనులే మనకు మంచి భవిష్యత్తు ఇస్తాయన్నారు. మనసు నియంత్రణలో ఉంటే గొప్ప ఆలోచనలు వస్తాయని.. అందుకు ధ్యానం ఎంతో దోహదపడుతుందన్నారు. దేశంలోని మతాల గొప్పతనం, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రపంచ దేశాలకు చాటే లా గ్లోబల్ ఆధ్మాత్మిక మహోత్సవాలను నిర్వహించడం ఆదర్శనీయమని కొనియాడారు. ఇందులో భాగంగా కన్హాశాంతి వనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మొక్కను నాటారు. రామచంద్రమిషన్ అధ్యక్షుడు డాక్టర్ దాజీ రాష్ట్రపతికి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారుల సంప్రదాయ పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేశ సాంస్కృతిక శాఖ కార్యదర్శి రజనాచోప్రా, ఇస్కాన్ ప్రతినిధి గోపాల్‌దాస్, రామకృష్ణ మిషన్ సభ్యులు స్వామి ఆత్మప్రియనంద, వివిధ ఆధ్మాత్మిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖ కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగు జాతీయ సదస్సు ప్రారంభం

సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖులు

హయత్‌నగర్, మార్చి 15 : హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైనది. ఇందులో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ప్రసంగిస్తూ ప్రాచీన కాలంలోనే అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు తెలంగాణలోనే ప్రారంభమయ్యాయని, అనంతర కాలంలోనే తెలుగు ప్రాంతాలన్నింటికీ విస్తరించాయని వివరించారు. దాదాపు 25 తెలుగు సాహిత్య ప్రక్రియలపై వెల్లడించారు. నిజాం ఏలుబడిలో జరిగిన పోరాటాల సమయంలో వచ్చిన సాహిత్యం గురించి రైతాంగ పోరాట కాలం నాటి సాహిత్యాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నాప్రభ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశానికి కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, యాదగిరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మ, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కె. లావణ్య, సేవారత్న నక్క శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల సదస్సు కన్వీనర్ డాక్టర్ సురేశ్, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ చింతల రాకేశ్‌భవాని, డాక్టర్ గంజి శశిధర్, సరస్వతి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలల నుంచి పత్రసమర్పణ చేయడానికి వచ్చిన అధ్యాపకులు, సాహిత్య అభిమానులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు... కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

# కల్యాణం.. కమనీయం

- వైభవంగా రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

కడ్తాల్, మార్చి 15 : మండలంలోని చరికొండ గ్రామంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని కొబ్బరి, అరటి, మామిడాకులు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం స్వామివారిని శుద్ధ జలం, పంచామృతాలతో అభిషేకించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రంగుల పూలమాలలతో వేణుగోపాలస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేశారు. స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాలు, తలంబ్రాలను గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగించారు. అనంతరం ఆలయ ధర్మకర్త, వేదపండితులు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, వేణుగోపాలచార్యులు, కిరణాచార్యులు వేద మంత్రోచ్చారణతో రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు రాములుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో మోహన్ రావు, మాజీ సర్పంచ్‌లు భారతమ్మ, లోకేశ్‌నాయక్, నాయకులు నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, భీష్మాచారి, గోపాల్, జంగయ్యగౌడ్, బాలకృష్ణగౌడ్, నరేశ్‌గౌడ్, రాజీవ్‌గౌడ్, ఆంజనేయులు, మహేందర్, బల్వంత్‌రెడ్డి, సత్యశీలారెడ్డి, మురళి, కరుణాకర్‌గుప్తా, దుర్గయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, యాదగిరి, ముత్యంగౌడ్, జగన్‌గౌడ్, అంజినాయక్, లింగంగౌడ్, అనిల్ చారి, రమేశ్‌చారి, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో పక్కన అదనపు కలెక్టర్లు, ఎస్పీ, అదనపు ఎస్పీ

# నోడల్ అధికారులదే కీలక పాత్ర

- వికారాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 15 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలకపాత్ర అని వికారాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు, ఎస్పీ, అదనపు ఎస్పీతో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి రానున్న లోక్‌సభ ఎన్నికలను జయప్రదం చేయా లన్నారు. ర్యాండమైజేషన్ తర్వాత పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల సామగ్రికి సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి నోడల్ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఎలాంటి ఇబ్బందులేకుండా చూసుకోవాలని ఎన్నికల మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి, డీడ బ్ల్యూవోను ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్‌లో భాగంగా అవసరమైన వాహనాల ఏర్పాటు, అంతర్రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దులు, చెక్ పోస్టుల్లో సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పట్టణస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా వలస కూలీలు, దివ్యాంగులు, మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన బందోబస్తు, అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, సెక్టోరల్ అధికారుల నియామకం తదితర విషయాలపై దృష్టి సారించాలని సంబంధిత శాఖలను కోరారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మీడియా నిర్వహణ, పెయిడ్ న్యూస్ తనిఖీలు, ప్రకటనల ముందస్తు అనుమతి వంటి వాటిపై మీడియా నోడల్ అధికారి దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం, సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. ఎన్నికల్లో అక్రమాల నివారణకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని కింది స్థాయి సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, తాండూరు ఆర్డీవో శ్రీనివాసులు, నోడల్ అధికారులు , డీఎస్పీలు, సీఐలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నార్మల్ డెలివరీలను పెంచాలి

### రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్ దవాఖానల్లో సీ-సెక్షన్ ప్రసవాలను తగ్గించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో శుక్రవారం రిజిస్టర్డ్ ప్రైవేట్ దవాఖానల వైద్యులు, గైనకాలజిస్టులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం, ఎంటీపీ, సరోగసీ చట్టాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాలని.. ఈ-బర్త్ పోర్టల్‌ను ఉపయోగించాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం రాష్ట్ర సంయుక్త సంచాలకులు డాక్టర్ పద్మజా మాట్లాడుతూ సీ-సెక్షన్ డెలివరీల్లో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించాలన్నారు. సీ-సెక్షన్ ఆడిట్ చేసేటప్పుడు తప్పనిసరిగా అవసరమైన రికార్డులను చూపాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన, జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి డాక్టర్ అరుణకుమారి, జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులను కాపాడాలి

### వికారాబాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్

వికారాబాద్, మార్చి 15 : వినియోగదారుల హక్కులను కాపాడాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయంలో అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎస్‌వో రాజేశ్వర్ మాట్లాడుతూ.. వినియోగదారుల ప్రయోజనాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. 1986లో వినియోగదారుల చట్టం వచ్చిందని, ఈ చట్టాన్ని 2019లో మార్పులు చేసి వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించడం జరిగిందన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దన్నారు. కొనుగోలు చేసే వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి, లీగల్ మెట్రాలజీ అధికారులు, రైస్‌మిల్లర్లు, చౌక ధర దుకాణాల డీలర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

## మైనారిటీ స్టడీ సర్కిల్‌ను వినియోగించుకోవాలి

వికారాబాద్, మార్చి 15 : మైనారిటీ స్టడీ సర్కిల్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-1 పరీక్షకు ఉచిత శిక్షణ అందిస్తుందన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ (ముస్లిం ,క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్సీలు) అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం వికారాబాద్‌లో సమర్పించాలన్నారు. సంబంధిత సాఫ్ట్ కాపీలను directormsctelangana@gmail.com మెయిల్ చేసి దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, గ్రూప్-1కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ కాఫీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జతచేయాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లలో 99121 44364, 94406 85713 సంప్రదించాలన్నారు.

## షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ

షాబాద్, మార్చి 15 : షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు 03-04-2024 నుంచి 02-06-2024 వరకు డీఎస్సీ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు రంగారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన జిల్లాలోని అభ్యర్థులు tsscstudycircle, telangana,gov.in అనే వెబ్‌సైట్ ద్వారా 26-03-2024 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చేవెళ్ల గురుకుల కళాశాలలో శిక్షణా తరగతులు ప్రారంభించి మాట్లాడుతున్న డాక్టర్ శారదావెంకటేశ్

## విద్యార్థినులు జీవన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

మొయినాబాద్, మార్చి 15 : ఇంటర్ విద్యార్థినులకు జీవన నైపుణ్యాన్ని పెంచేందుకు వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారిణి డాక్టర్ శారదావెంకటేశ్ అన్నారు. మండలంలోని తోలుకట్టా గ్రామ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల కళాశాలలో స్పార్కిల్స్ పేరుతో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని డాక్టర్ శారదావెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ శారద మాట్లాడుతూ ఈ శిబిరంలో జీవన నైపుణ్యం, మొబైల్ యాప్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, యువ జర్నలిస్టు అనే నాలుగు అంశాల్లో విద్యార్థినులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 13 కళాశాలల నుంచి.. ఒక్కో కాలేజీ నుంచి పదిమంది చొప్పున ఈ శిక్షణకు హాజరవుతారన్నారు. ఈనెల 29వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. విద్యార్థినులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని జీవన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థినులకు శిక్షణా తరగతులు ఏర్పా టు చేసిన గురుకుల విద్యాసంస్థ కార్యదర్శి సీతాలక్ష్మికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బంట్వారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు 'ఈ-శ్రమ్'లో పేర్లు నమోదు చేసుకోవాలి

వికారాబాద్, మార్చి 15 : ప్రమాదవశాత్తు చనిపోయినా, అంగవైకల్యం పొందిన కార్మికులు ఎక్స్‌గ్రేషియాను పొందొచ్చని జిల్లా సహాయ కార్మిక శాఖ కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌గ్రేషియా పొందేందుకు వీలుగా కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ఈ-శ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని.. అ సంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

# ప్రతి మొక్కనూ కాపాడాలి

- రంగారెడ్డి డీఆర్‌డీవో శ్రీలత
- నల్లవెల్లిలో నర్సరీ, ఈజీఎస్ పనులు పరిశీలన

నల్లవెల్లి నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

యాచారం, మార్చి 15 : నర్సరీల్లో పెంచుతున్న ప్రతి మొక్కనూ కాపాడాలని రంగారెడ్డి డీఆర్‌డీవో శ్రీలత అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని నల్లవెల్లి గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించి.. నర్సరీలో పెంచుతున్న హరితహారం మొక్కలను పరిశీలించారు. మొక్కలకు నిత్యం సరిపడా నీటిని అందించి కాపాడాలని, మొక్కలు ఏపుగా పెరిగేందుకు కంపోస్ట్ ఎరువును వినియోగించాలన్నారు. అనంతరం ఆమె గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారు. ఎలాంటి పనులు చేస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చలువపందిర్లు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని సూచించారు. రానున్న హరితహారం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకీ ఉపాధి పనిని కల్పించాలన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని.. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సమ్మర్‌లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో సుభాషిణి, ఏపీడీ సరియానాయక్, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీవోలింగయ్య, ఈవో శివశంకర్‌రెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పాత వీడియో మార్ఫింగ్ నిందితుడిపై కేసు నమోదు

వికారాబాద్, మార్చి 15 : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాత వీడియోను మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. స్పీకర్ గతంలో మాట్లాడిన పాత వీడియోను శంకర్ అనే వ్యక్తి ఇప్పుడే మాట్లాడినట్లుగా మార్ఫింగ్ చేసి యూట్యూబ్ చానల్, సోషల్ మీడియాలో పోస్టు చేశాడన్నాడు. అనంతయ్య అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అతడిపై వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎల్బీనగర్, మార్చి 15 : చైతన్యపురిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మహిళా గురుకుల పీజీ కళాశాలలో స్టాటిస్టిక్స్ బోధించేందుకు మహిళా అతిథి అధ్యాపకుల ఎంపిక కోసం మార్చి 18న నిర్వహించే డెమో ఇంటర్వ్యూలకు అర్హులు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో కోరారు. పీజీ ఉత్తీర్ణత ఉండి, బోధన అనుభవం సెట్/నెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో సోమవారం ఉదయం 9 గంటలకు చైతన్యపురిలోని కళాశాలలో హాజరుకావాలన్నారు. 9948470727, 7842640095లలో సంప్రదించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సరిత

## ప్రతి ఇంటికీ భగీరథ నీటిని అందించాలి

### వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

కందుకూరు. మార్చి 15 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సరిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ హాలులో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. నీటి ఎద్దడి రాకుండా కృషి చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ అందేలా చూడాలని.. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్న నేపథ్యంలో వారు తమ బాధ్యతలను సక్రమంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. పని చేసే చోట వసతులను కల్పించాలన్నారు. ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని.. 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, ఏపీవో రవీందర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెలాఖరులోగా అందించాల్సిందే..

### వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 15 : 2021-22 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్‌ను అందించడంలో డిఫాల్ట్ అయిన మిల్లర్లు ఏప్రిల్ మాసంలోపు అందించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మిల్లర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను ఏప్రిల్ చివరిలోపు పౌరసరఫరాల శాఖకు వంద శాతం చేరవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి, రైస్ మిల్లర్ల జిల్లా అధ్యక్షుడు బాలేశ్‌గుప్తా, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.